
సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



సాంకేతిక అధ్యయనం

గోల్కొండ టూంబ్స్ నుంచి కోట వరకు ప్రతిపాదిత రోప్‌వేపై గురువారం హెచ్‌ఎండీఏలో ప్రీబిడ్డింగ్ సమావేశం జరిగింది. 8లో▸



కూతురి పెళ్లికి దాచితే..

కూతురి పెళ్లికోసం దాచిన నగదు,బంగారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో▸



పన్నెండేళ్లకు పచ్చజెండా!

పాటిగడ్డ మీదుగా ఆర్‌ఓబీ (ఫ్లై ఓవర్) నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ, దక్షిణమధ్య రైల్వే అంగీకారానికి వచ్చాయి. 8లో▸

పాలమూరు పూర్తి చేస్తాం

ప్రజల ఆకాంక్ష మేరకే ప్రభుత్వం పనిచేస్తుంది

- పాదయాత్రతో ప్రజా సమస్యలు తెలుసుకుంటాం
- గత ప్రభుత్వమే 'ప్రాణహిత– చేవెళ్ల'ను రద్దు చేసింది
- జనహిత పాదయాత్రలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మీనాక్షి నటరాజన్‌కు పార్టీ జెండా అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు తదితరులు

పరిగి: ప్రజల ఆకాంక్ష మేరకే కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర గురువారం పరిగి మండలం రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ బిల్లును కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. దీనిపై కేంద్రంతో కొట్లాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. కేంద్రం మెడలు వంచి బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి పరిగి ప్రాంతం రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.



జనహిత పాదయాత్రలో పార్టీ నేతలు

సంక్షేమంలో మనమే ఆదర్శం

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. పట్టణంలో జనహిత పాదయాత్ర అట్టహాసంగా సాగింది. కిలోమీటర్ల మేర ప్రజలు బారులు తీరారు. పాదయాత్రలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పార్టీ జిల్లా, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మండల నాయ కులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనహితయాత్రకు ఘన స్వాగతం



మొయినాబాద్: చిలుకూరు సన్నిధిలో మీనాక్షి నటరాజన్ తదితరులు

- మొయినాబాద్‌లో ఆహ్వానం పలికిన పార్టీ శ్రేణులు
- చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు చేసి పాదయాత్రకు బయలుదేరిన నేతలు



చేవెళ్ల: నేతలకు గజమాలతో స్వాగతం

చేవెళ్ల/మొయినాబాద్: వికారాబాద్ జిల్లా పరిగి నుంచి ప్రారంభించే జనహిత పాదయాత్రకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పార్టీ శ్రేణులు మొయినాబాద్‌లో ఘన స్వాగతం పలికాయి. హిమాయత్‌నగర్ చౌరస్తాకు చేరుకోగానే పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. అక్కడే ఉన్న అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాలకు మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యు డు షాబాద్ దర్శన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరులో పూజలు

చిలుకూరు బాలాజీ దేవాలయంలో మీనాక్షి నటరాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు హన్మంతరావు, రాజయ్య తదితరులతో కలిసి ఆమె ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు సురేష్‌స్వామి ఆమెకు స్వామివారి పూలమాలలు అందజేసి ఆశీర్వదించారు.

చేవెళ్లలో పామెన బీంభరత్ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు చేవెళ్లలో పామెన భీంభరత్ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షాబాద్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా నాయకుడు గౌరీ సతీష్, మహిళా నాయకురాలు జ్యోతిభీంభరత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గపోరు మరోసారి బట్టబయలు

పార్టీలో వర్గపోరు కొనసాగుతుందని మరోసారి బట్టబయలైంది. ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ మధ్య సయోధ్య లేకపోవటంతో ఇరు వర్గీయులు వేర్వేరుగా స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్యక్రమం విజయవంతం చేయాలి

గచ్చిబౌలి: వర్షాకాల పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఉదయం వర్షాకాలం పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. మొదట మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో తనిఖీలు చేశారు. తర్వాత పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కాలనీల్లో పరిశుభ్రతా చర్యలు ప్రభావవంతంగా చేపట్టాలన్నారు. డిప్యూటీ కమిషనర్, స్థానిక అధికారులతో కలిసి పారిశుద్ధ్య పనులను సమీక్షించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య పనులను వేగంగా చేపట్టాలన్నారు.



శేరిలింగంపల్లి జోన్‌లో కర్ణన్ తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

ఫార్మాసిటీలో మరోసారి సర్వే

- సర్వేనంబర్ల వారీగా భూమి గుర్తింపు
- అడ్డుకున్న నక్కర్తమేడిపల్లి రైతులు
- ఉద్రిక్త వాతావరణం
- భారీ పోలీసు బందోబస్తు

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో అధికారులు మరోసారి సర్వేకు సిద్ధం కావడం ఉద్రిక్తతకు దారితీసింది. రెండు నెలల క్రితం ఫార్మాసిటీ బౌండరీని సర్వే చేసి, ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. తాజాగా గురువారం బౌండరీ లోపల హద్దులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో సర్వే నంబర్ల వారీగా గుర్తించే పనులను మొదలుపెట్టారు. గ్రామంలోని పలు అసైన్డ్, పట్టా భూముల సర్వేనంబర్ల వారీగా ఎంత మంది రైతులకు, ఎన్ని ఎకరాలకు పరిహారం అందజేశామనే వివరాలతో కూడిన రికార్డుల ప్రకారం హద్దులు గుర్తిస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. తమ భూముల వద్దకు రావద్దని అడ్డుకున్నారు.

అభ్యంతరం చెప్పడం సరికాదు

నిర్వాసితులకు పరిహారంతో పాటు తాజాగా మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లో లాటరీ తీసి ప్లాట్ల కబ్జాలు ఇచ్చామని ఆర్డీఓ అనంత్‌రెడ్డి తెలిపారు. అయినా రైతులు అభ్యంతరం తెలపడం సరికాదని అన్నారు. పరిహారం అందజేసిన, రికార్డులు మారిన భూములన్నీ సర్కార్‌వేనని, ఆ భూముల్లోకి ఎవరూ రావొద్దని సూచించారు. కోర్టు కేసులున్న భూముల్లోకి వెళ్లమని హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వే చేస్తున్న భూముల వద్దకు రైతులెవరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

బందోబస్తు మధ్య ఫార్మా ఫెన్సింగ్

కందుకూరు: ఫార్మాసిటీ కోసం మండలంలోని ముచ్చర్ల రెవెన్యూ సర్వే నంబర్ 123కు సంబంధించి గురువారం అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్ పనులు చేపట్టారు. దీంతో సర్వే నంబర్‌ను ఆనుకుని ఉన్న దెబ్బడగూడ రెవెన్యూ సర్వే నంబర్ 31లోని గిరిజన రైతులు పనులను అడ్డుకున్నారు. తమ భూమిలోకి జరిపి ఫెన్సింగ్ ఎలా వేస్తారంటూ నిలదీశారు. సర్వే చేసిన తర్వాతే ఫెన్సింగ్ వేసుకోవాలని పట్టుబట్టారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీరెడ్డి, సీఐ సీతారాం రైతులతో మాట్లాడారు. పది రోజుల్లో దెబ్బడగూడ సర్వే నంబర్ 31ని సర్వే చేయిస్తామని, అప్పటి వరకు ఫెన్సింగ్ పనులు ఆపాలని అన్నారు. భూమి మీకు వస్తే తిరిగి ఇచ్చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



నక్కర్తమేడిపల్లిలో పోలీస్ పహారా

పెండింగ్ దరఖాస్తులు పరిశీలించండి

- ఇందిరమ్మ ఇళ్ల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను నియమించాలి
- వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, పారిశుద్ధ్యం, వనమహోత్సవం వంటి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఖాళీ స్థలం ఉండి, ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు మంజూరు ఇవ్వాలని, గతంలో రుణాలు తీసుకుని, ప్రస్తుతం అర్హులుగా ఉన్న వారికి అవగాహన కల్పించాలని, పీఎం ఆవాస్ యోజన కింద అర్హులైన వారందరి పేర్లను వెంటనే నమోదు చేయాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎరువుల కొరత రానివ్వొద్దు

వర్షాకాలం నేపథ్యంలో ఆయా మండల కేంద్రాల్లోని గోదాముల్లో అవసరమైన యూరియా ఎరువులు వంద శాతం అందుబాటులో నిల్వ ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఎక్కడా కొరత లేకుండా, రైతులు రోడ్లపైకి వచ్చే పరిస్థితి రావొద్దని వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లు, సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి సమస్య వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. నాణ్యమైన ఆహారం, తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చూడాలని, తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని, అందుకు సంబంధించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ హాస్టళ్లలో కూరగాయలు నిల్వ చేయకుండా రెండ్రోజులకు ఒకసారి తెచ్చుకోవాలని, వంటగదిని పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఆయా ఎంఈఓలు పర్యవేక్షించాలన్నారు.

లక్ష్యం మేర మొక్కలు నాటాలి

వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని, ప్రత్యేకించి ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు నాటాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పల్లె ప్రకృతి వనాల్లో వంద శాతం నాటాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సరైన సమయంలో మొక్కలు నాటేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వ విద్యాలయాలను అభివృద్ధి పర్చాలి



మంచాల ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల: ప్రభుత్వ విద్యా సంస్థల్లో మార్పు తేవడమే లక్ష్యమని రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. మౌలిక వసతులు, విద్యా విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. మంచాల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నూటికి ఎనభై శాతం బడుగుబలహీన వర్గాల పిల్లలు ఉంటారని తెలిపారు. వారికి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ సహకారం, స్థానికుల తోడ్పాటుతోనే మార్పు సాధ్యమన్నారు. మన పిల్లల కోసం మనందరం బాధ్యతగా కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు జ్యోత్స్న, పద్మజాషా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఝాన్సీ, రుబియానా, విద్యాకమిటీ సభ్యుడు అశ్వల బాలరాజు పాల్గొన్నారు.

చిరుత చిక్కింది

ట్రెక్ పార్కులోనే బోన్‌లోకి వచ్చి..

- ఉదయం గమనించిన సిబ్బంది
- తొలుత జూపార్క్‌కు తరలింపు
- అక్కడి నుంచి నల్లమల అడవుల్లోకి..
- నేటి నుంచి తెరుచుకోనున్న ట్రెక్ పార్కు



బోనులో చిక్కిన చిరుతపులి

మణికొండ: కొద్దిరోజులుగా భయభ్రాంతులకు గురిచేసిన చిరుత పులి ఎట్టకేలకు మంచిరేవుల ట్రెక్ పార్కులోనే బోన్‌లో చిక్కింది. జూలై 7వ తేదీన మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ వనమూలిక వనం నుంచి మొదలైన దాని ప్రస్థానం పోలీస్ గ్రేహౌండ్స్, ట్రెక్ పార్కు, రాందేవ్‌గూడ మిలిటరీ ఏరియా, తిరిగి ట్రెక్ పార్కుకు వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రి దాటాక ఆకలితో మేకను తినేందుకు బోనులోకి దూరి బందీ అయ్యింది. ప్రతి రోజూ మాదిరిగానే ఉదయం సిబ్బంది బోనులను తనిఖీ చేస్తున్న క్రమంలో ఒకదాంట్లో చిరుత గాండ్రింపులు విని భయాందోళన చెందారు. అంతలోనే తేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి బోను చుట్టూరా పరదాలను కట్టి నగరంలోని జూపార్కుకు తరలించారు. అక్కడ దాని గాయాలకు చికిత్సతో పాటు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేసిన తర్వాత నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్టు జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, చిలుకూరు రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

చిరుత మూతికి గాయం

బోనులో చిక్కుకున్న చిరుత అందులోనుంచి బయటికి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో దాని మూతి బోను ఇనుప చువ్వలకు తాకడంతో గాయమైంది. బోనులో చిక్కుకున్న భయంలో అది అందులో ఏర్పాటు చేసిన మేకను సైతం తినకుండా ఉండిపోయింది. చిరుత వయసు సుమారు 5 ఏళ్లు ఉంటాయని, యుక్త వయసులో ఉండటంతో పెద్దగా గాండ్రించటం, బెదిరించటం చేసిందని అటవీ అధికారులు తెలిపారు. చిరుతపులి ఎట్టకేలకు అటవీ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిక్కిందనే విషయాన్ని తెలుసుకున్న మంచిరేవుల, గంధంగూడ, బైరాగిగూడ, నార్సింగి, కోకాపేట, రాందేవ్‌గూడ, ఇబ్రహీంబాగ్ తదితర గ్రామాల ప్రజలు దాన్ని చూసేందుకు ట్రెక్ పార్కు వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చారు. శుక్రవారం నుంచి యథావిధిగా ట్రెక్ పార్కును తెరుస్తామని, వాకింగ్ చేసేవారు రావచ్చని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కేంద్ర పథకాలతో ప్రయోజనం పొందొచ్చు



మాట్లాడుతున్న సహదేవన్ రాధాకృష్ణన్

మొయినాబాద్: కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలతో ప్రయోజనం పొందొచ్చని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సహదేవన్ రాధాకృష్ణన్ అన్నారు. మండల పరిధిలోని తోలుకట్టలో ఆర్థిక సేవల శాఖ సూచనల మేరకు ఎస్‌బీఐ మొయినాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన కొన్ని పథకాల సేవలను ఎస్‌బీఐ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలు, పునః కేవైసీ, సేవింగ్ ఖాతాల్లో నామినేషన్ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రధాన మేనేజర్ సతీష్‌కుమార్, డిప్యూటీ జనర్ మేనేజర్ రోహిత్‌కుమార్, వికారాబాద్ ఆర్‌బీఓ ప్రాంతీయ మేనేజర్ నితిన్, మొయినాబాద్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫోరం ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం సరూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం, 25వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వెంటనే హామీలను నెరవేర్చడంతో పాటు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం బోర్డు ఏర్పాటు చేసి స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహగౌడ్, పసునూరి బలరాం, జోర్క రాము ముదిరాజ్, రాజునాయక్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సాగిన గద్దర్

లక్డీకాపూల్: ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన గద్దర్ జీవితం ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సాగిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ ఫౌండేషన్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి తదితరులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు గద్దర్ ఉద్యమించారన్నారు. ఆయన చూపిన మార్గంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గద్దర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రత్యేక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ కార్యదర్శి సూర్య పేర్కొన్నారు.

విదేశీ వాణిజ్య ఒప్పందం ప్రమాదకరం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్


అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం విదేశీ వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై సంతకం చేయడమంటే అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు లొంగిపోవడమేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. గురువారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు శ్యామయ్య అధ్యక్షతన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు.. పరిష్కారాలు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, పాడి, ఆహార, మార్కెట్ రంగాలకు ద్వారాలు తెరవడంతో దేశ ప్రయోజనాలు దెబ్బతింటాయని తెలిపారు. కేంద్రం తీసుకున్న చర్యలను వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు మహిపాల్, సతీష్, లక్ష్మయ్య, వల్యానాయక జామాలొద్దీన్, అనసూయ లక్ష్మి, రాజు, బస్వరాజు, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వక్రబుద్ధి

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- గతంలో కేసు నమోదైనా తీరుమారని వైనం

మొయినాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న ఓ వ్యక్తి తన వక్రబుద్ధితో ఆ వృత్తికే చెడ్డ పేరు తెస్తున్నాడు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఇతనిపై గతంలో కేసు నమోదైనా 'కుక్క తోక వంకర'అనే చందంగా మార్పు మాత్రం రాలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ బుధవారం ఓ పదో తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పరుష పదజాలంతో తిట్టాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన బాలిక ఈ విషయాన్ని తండ్రికి చెప్పింది. గురువారం స్కూల్‌కు వచ్చిన ఆయన ఉపాధ్యాయుడిని నిలదీయగా అతన్ని సైతం తీవ్రంగా దూషించడంతో పాటు చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. తోటి ఉపాధ్యాయులు వద్దని వారించినా పట్టించుకోలేదు. దీంతో కంగుతిన్న బాలిక తండ్రి హెచ్‌ఎంకు ఫోన్ చేయగా.. తాను సెలవులో ఉన్నానని సోమవారం వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ఇదే పాఠశాలలోని మరో విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించిన ప్రవీణ్‌కుమార్‌పై అప్పట్లో షీటీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కోర్టులో హాజరు పర్చగా.. తీవ్రంగా మందలించిన న్యాయస్థానం జరిమానా విధించింది. అయినప్పటికీ అతని ప్రవర్తన మారలేదని, ఈ విషయమై డీఈఓకు లేఖ రాశామని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. అయనను ఇక్కడి నుంచి బదిలీ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'జనహిత'లో నేతల సందడి



మహేశ్వరం: మహేశ్‌కుమార్ గౌడ్‌తో భాస్కర్‌రెడ్డి, నాయకులు



కందుకూరు: పాదయాత్రలో కేఎల్‌ఆర్‌తో నాయకులు



కందుకూరు: మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్రలో భాగంగా పరిగిలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి గురువారం కలిసి స్వాగతం పలికారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పీసీసీ చీఫ్ నేతలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి ప్రతి కార్యకర్త తీసుకెళ్లాలని మహేశ్‌కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు.

తరలిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: టీపీసీసీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్రలో గురువారం సాయంత్రం మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లారు. కందుకూరు నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, గణేష్‌నాయక్, మదన్‌పాల్‌రెడ్డి, బాబురావు, కృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

కొందుర్గు: మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని బైరంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులపల్లి నర్సింలు(35) బుధవారం మధ్యాహ్నం అదే ఊరిలో ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటంతో ప్రహరీ దూకి వెళ్లాడు. ఇది గమనించిన సదరు మహిళ గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వాళ్లు చేరుకున్నారు. అంతలోనే నర్సింలు తప్పించుకొని పారిపోయాడు. ఈ విషయమై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ఎవరిని పెళ్లి చేసుకున్నా చంపేస్తా..

యువతికి మాజీ ప్రియుడి బెదిరింపులు

సనత్‌నగర్: ఎవరినైనా పెళ్లి చేసుకుంటే ఆ వ్యక్తిని చంపేస్తానంటూ ఓ యువతిని బెదిరించిన ఆమె మాజీ ప్రియుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫతేనగర్ ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన యువతికి రవికుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అయితే రవికుమార్ కొన్నాళ్లుగా ఆమెను వేధిస్తుండడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా ఇరువురూ మళ్లీ కలవబోమని అంగీకరించారు. ఇదిలా ఉండగా సదరు యువతికి ఇటీవల పెళ్లి కుదిరింది. ఈ విషయం తెలుసుకున్న రవికుమార్.. వరుడికి ఫోన్ చేసి ఆమె గురించి చెడుగా చెప్పాడు. అంతేకాకుండా బాధితురాలికి ఫోన్ చేసి ఎవరినైనా పెళ్లి చేసుకుంటే అతడిని చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగింత


కుల్కచర్ల: చదవడం ఇష్టం లేక పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన గుడిసె అఖిల్ ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ స్థానికంగా బీసీ వసతిగృహంలో ఉంటున్నాడు. బుధవారం అతడు పాఠశాల సమయంలో బయటకు వచ్చి కుల్కచర్లకు వచ్చి బస్సులో షాద్‌నగర్ వెళ్లాడు. అక్కడ పోలీసులు బాలుడిని గమనించి వివరాలు అడిగారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అతడి చిరునామా తెలుసుకుని స్థానికుల ద్వారా కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గురువారం ఉదయం ఎంఈఓ హబీబ్ అహ్మద్ సమక్షంలో అఖిల్‌ను కుటుంబీకులకు అప్పజెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్, వసతిగృహ ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడిని కుటుంబీకులకు అప్పజెప్పుతున్న ఉపాధ్యాయులు, పోలీసులు

గోల్కొండ రోప్‌వే పై సాంకేతిక అధ్యయనం





ఆర్‌ఎఫ్‌పీ కోసం ఈ నెల 6 వరకు బిడ్డింగ్

- ప్రీ బిడ్డింగ్ సమావేశంలో పాల్గొన్న పలు సంస్థలు
- రూ.100 కోట్లతో హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ టూంబ్స్ నుంచి కోట వరకు ప్రతిపాదించిన రోప్‌వేపై గురువారం హెచ్‌ఎండీఏలో ప్రీబిడ్డింగ్ సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. సుమారు 1.5 కి.మీ మార్గంలో నిర్మించనున్న రోప్‌వే కోసం ఇప్పటికే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్‌ఎఫ్‌పీ) టెండర్లను ఆహ్వానించారు. ఆసక్తిగల కన్సల్టెన్సీ సంస్థలు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలోనే గురువారం ప్రీబిడ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆర్‌ఎఫ్‌పీ బిడ్డింగ్ కోసం కోసం దరఖాస్తు చేసుకున్న పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిడ్డింగ్ గడువును పెంచాలని పలువురు ప్రతినిధులు హెచ్‌ఎండీఏ అధికారులను కోరారు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టుపై మరింత అవగాహన అవసరమని, అందు కోసం బిడ్డింగ్ గడువును పెంచాలని అధికారుల దృష్టికి తెచ్చినట్లు సమాచారం.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు..

నిత్యం వేలాది మంది జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు సందర్శించే చారిత్రక గోల్కొండ కోటను, టూంబ్స్‌ను కలిపేలా నిర్మించనున్న రోప్‌వే ప్రాజెక్టును హెచ్‌ఎండీఏ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. రూ.100 కోట్ల అంచనాలతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోప్‌వేలు, స్కైవేలపై విస్తృత అధ్యయనం చేస్తున్న హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ హుమ్టా గోల్కొండ కోట నుంచి 1.5 కి.మీ దూరంలోని కుతుబ్‌షాహీల సమాధుల వరకు రోప్‌వే కోసం ఇప్పటికే ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం సైతం పచ్చజెండా ఊపింది. దీంతో ఆర్‌ఎఫ్‌పీ బిడ్డింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు. రోప్‌వేకు అనుకూలమైన మార్గాన్ని నిర్ధారించడంతో పాటు, రక్షణశాఖ నుంచి ఏ రకమైన సహాయ సహకారాలు అవసరమనే అంశంపైనా ఎంపికైన కన్సల్టెన్సీ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. వివిధ దేశాల్లో రోప్‌వేలు, కేబుల్ కార్ల నిర్వహణపైనా అధ్యయనం చేసి హెచ్‌ఎండీఏకు నివేదికను అందజేయాల్సి ఉంటుంది.

కేబుల్ కారులో సందర్శన..

గోల్కొండ కోట నుంచి పర్యాటకులు రోడ్డు మార్గంలో టూంబ్స్ వరకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. ఇరుకైన రోడ్డు, వాహనాల రద్దీ దృష్ట్యా చాలామంది గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు వెళ్లకుండానే వెనుదిరుగుతున్నట్లు అంచనా. ఈ క్రమంలో పర్యాటకుల రాకపోకలను సులభతరం చేయడంతో పాటు రోప్‌వే ద్వారా కేబుల్ కార్లలో ప్రయాణం చేయడం ఒక ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 10 వేల మందికి పైగా ఈ రెండు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. వీరిలో 3000 మంది వరకు విదేశీ టూరిస్టులు ఉంటారని అంచనా. రోప్‌వేను ఏర్పాటు చేయడం వల్ల పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్మించడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా పర్యాటకులకు మెరుగైన సదుపాయం కల్పించినట్లవుతుందని అధికారులు భావిస్తున్నారు.

కూతురి పెళ్లికి దాచితే.. దోచేశారు!



పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితులు

మామిడిపల్లిలో భారీ చోరీ

- రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారం అపహరణ

నందిగామ: కూతురి పెళ్లి కోసం దాచిన నగదు, బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని మండలంలోని మామిడిపల్లికి చెందిన వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా స్పందన కరువైందని లబోదిబోమన్నాడు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య కొందుర్గు మండలంలోని మహదేవ్‌పూర్‌లో ఉన్న భూమిని గతంలో విక్రయించాడు. వచ్చిన డబ్బులతో కొంత అవసరాల కోసం వాడుకున్నాడు. కూతురుకు పెళ్లి చేయాలనే ఉద్దేశంతో 16 తులాల బంగారాన్ని కొనుగోలు చేసి, రూ.15 లక్షల నగదును ఇంట్లో భద్రపరిచాడు. ఇటీవల రుణం చెల్లించాలని బ్యాంకు నుంచి ఫోన్ రావడంతో ఇంట్లో చూడగా నగదు, బంగారం కనబడకపోవడంతో లబోదిబోమన్నాడు. డబ్బులు, పసిడి దోచుకుపోయిన విషయమై కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో చర్చించాడు. ఎక్కడ నుంచి కనీస సమాచారం లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారణ చేశారు. గురువారం తిరిగి బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇంట్లో సజ్జపై దాచిన డబ్బులను తెలిసిన వారే దోచుకుపోవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేసు నమోదు చేయని పోలీసులు

మామిడిపల్లిలో ఇంత పెద్ద చోరీ జరిగినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. బాధితులను విచారించామని, ఏసీపీ శుక్రవారం వస్తారని, మరోసారి విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పన్నెండేళ్లకు పచ్చజెండా!

బేగంపేట్‌లో తప్పనున్న ట్రాఫిక్ చిక్కులు

- త్వరలో పాటిగడ్డ-నెక్లెస్ రోడ్డు ఆర్‌ఓబీ పనులు
- పుష్కర కాలం నాటి ప్రతిపాదనలకు మోక్షం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: పుష్కరకాలం నాటి ప్రతిపాదనలు తిరిగి పట్టాలెక్కనున్నాయి. హైదరాబాద్- సికింద్రాబాద్‌లను కలిపే బేగంపేట్ రోడ్-రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ మార్గానికి ప్రత్యామ్నాయంగా ఎస్పీ రోడ్ –నెక్లెస్ రోడ్‌ను కలుపుతూ పాటిగడ్డ మీదుగా ఆర్‌ఓబీ (ఫ్లై ఓవర్) ప్రాధాన్యతతో నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ, దక్షిణమధ్య రైల్వే అంగీకారానికి వచ్చాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 80 కోట్లు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

సమన్వయం, సహకారం లోపంతో..

- ఇక్కడి ఆర్‌ఓబీ ప్రతిపాదన ఈనాటిది కాదు. నగరంలో మెట్రో రైలు పనులు ప్రారంభం కావడాని కంటే ఎంతోకాలం ముందే ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ, ఆయా ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, సహకార లోపంతో కాగితాలు దాటి పనులు మొదలు కాలేదు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బేగంపేట వైపు నుంచి ఖైరతాబాద్, సెక్రటేరియట్‌ల వైపు వచ్చే వారికి ఎంతో సమయం ఆదా అవుతుంది.



సెక్రటేరియట్- ట్యాంక్‌బండ్- ప్యారడైజ్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుంది. అప్పటి అంచనా వ్యయం రూ.25 కోట్లు ప్రస్తుతం రూ. 80 కోట్లయింది.

- ఈ ఫ్లైఓవర్ పనులు పూర్తయితే అటు ఎస్పీ రోడ్, ఇటు ఎంజీ రోడ్‌లోనూ ట్రాఫిక్‌కు ఎంతో ఉపశమనం కలుగుతుంది. అప్పట్లోనే రైల్వే శాఖ నుంచి అనుమతులున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దాదాపు 7.5 మీటర్లుండే ఫ్లై ఓవర్‌పై రెండు వైపులా క్యారేజ్‌వేలతో పాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్‌లు గత ప్రతిపాదనల్లో ఉన్నాయి. అవసరమైతే మార్పుచేర్పులు చేయనున్నారు.

ఫ్లైఓవర్ ఫ్లాష్‌బ్యాక్ ఇలా..

2009లో ఉమ్టా సమావేశంలో ఈ ప్రాజెక్టు కయ్యే వ్యయాన్ని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ చెరిసగం భరించాలని, పనులు హెచ్‌ఎండీఏ చేయాలని నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ ఇవ్వాల్సిన నిధులు జీహెచ్‌ఎంసీ ఇవ్వలేదు. హెచ్‌ఎండీఏ సైతం నిధులివ్వలేమని, ప్రాజెక్టు పని చేయలేమని, పనుల్ని జీహెచ్‌ఎంసీకి బదలాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. అనంతరం మెగాసిటీ ప్రాజెక్ట్ కింద చేపట్టాలనుకున్నారు. ఏదీ కాలేదు. బేగంపేట, ఎంజీరోడ్ మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, రైల్వే అధికారుల సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తయితే అటు బేగంపేట, ఇటుఎంజీ రోడ్లలో రద్దీ తగ్గనున్నందున మెహిదీపట్నం- సికింద్రాబాద్ రాకపోకల సమయం సైతం తగ్గనుందని అధికారులు పేర్కొన్నారు.

డీ అడిక్షన్ సెంటర్ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న డీజీ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: మత్తు మందులు లేని సమాజాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ శాఖ నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. జైళ్ల శాఖ నిర్వహిస్తున్న డీ అడిక్షన్ సెంటర్లలో విధులు నిర్వహించేందుకు గత నెలలో కాంట్రాక్ట్ పద్ధతిన 28 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి గురువారం చంచల్‌గూడలోని సీకా సంస్థలో శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డీ అడిక్షన్ కేంద్రాల్లో ఉండే వారితో ఎలా మెలగాలో, వారిలో పరివర్తన ఏ విధంగా తీసుకురావాలి అనే అంశంపై సిబ్బంది అంటీ డ్రగ్స్, నార్కోటిక్, మానసిక వైద్య కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఐజీ మురళీబాబు, సీకా ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాల సమస్యలకు బైద్యనాథ్...

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో వచ్చే జలుబు, ఫ్లూ, దగ్గు, జ్వరం, విరేచనాలు, మలేరియా తదితర అనారోగ్య సమస్యలను నివారించేందుకు బైద్యనాథ్ పలు చికిత్సలు అందిస్తోందని బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. జలుబు, దగ్గు, తరచుగా తుమ్ములు, ఆకలి లేకపోవడం, శరీర నొప్పులు వంటివి ఉంటే లక్ష్మీవిలాస్ రస్ (నార్దియా)ను,, బైద్యనాథ్ కసమృత్‌ను తీసుకోవాలని సూచించారు. దగ్గు తీవ్రత ఎక్కువగా ఉంటే, అర టీస్పూన్ సితోపలాడి చూర్ణాన్ని, జ్వరం వస్తే, బైద్యనాథ్ మహాసుదర్శన్ ఘన్ బటి తీసుకోవాలన్నారు. విరేచనాలతో ఇబ్బంది పడితే సంజీవని బటి, ఐ టాబ్లెట్‌ను,, విరేచనాలు శ్లేష్మం కడుపు తిమ్మిరి ఉన్న సందర్భాల్లో, బైద్యనాథ్ అమీబికా టాబ్లెట్‌ను, బైద్యనాథ్ కుటజారిష్ట, తీసుకోవాలన్నారు. ఆకలి లేకపోవడం, మూత్రం కళ్లు పసుపు రంగులోకి మారడం. జరిగితే బైద్యనాథ్ పునర్నవాది మండూర్ తీసుకోవాలని సూచించారు.

28 మంది పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ

బంజారాహిల్స్: హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం 28 మంది పోలీసు అధికారులు పదవీ విరమణ చేశారు. వీరిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, నలుగురు ఎస్‌ఐలు, 21 మంది ఏఎస్‌ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) పరిమళ హానా నూతన్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం భగవంతుడు అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, శేష జీవితం కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

బషీరాబాద్: కొంత కాలంగా ఒకరినొకరు ప్రేమించుకున్న ఓ జంట పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసన్‌పల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాస్, శాంతమ్మ కొడుకు గౌతం(23) చిన్నప్పటి నుంచి వారి అమ్మమ్మ ఊరైన గండీడ్ మండలం నంచర్లలో చదువుకున్నాడు. అదే గ్రామానికి చెందిన మౌనిక(20)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇంటి నుంచి పారిపోయి గురువారం ఉదయం మాసన్‌పల్లి శివాలయంలో పెళ్లి చేసుకున్నారు. అమ్మాయి బంధువుల నుంచి ప్రాణహాని ఉందని బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఇరువురూ ఆశ్రయించారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గురువారం ఉదయం తరగతిలో పాఠాలు చెబుతుండగా పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి పడ్డాయి. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు పరుగులు తీశారు. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇబ్బంది పడుతున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 185 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయించాలి గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఓ నమూనా

హైడ్రా కృషిని అభినందించిన కేంద్ర బృందం



బతుకమ్మ కుంట వద్ద అధికారుల బృందం

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) అధికారుల బృందం గురువారం అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించింది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ఈ ప్రాంతం చెరువులా రూపాంతరం చెందిన పాత చిత్రాలను చూసి అధికారులు ఆశ్చర్యచకితులయ్యారు. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అడిషనల్ చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ పేర్కొన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించి, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు నీరు ఉబికి వచ్చే వీడియోలను చూసిన ఆయన ఆశ్చర్యపోయారు. హైడ్రా కృషిని అభినందించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాల్వలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడంపై హర్షం వెలిబుచ్చారు. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియాల ద్వారా హైడ్రా అధికారులు కేంద్ర బృందానికి చూపించారు. చెరువు ఔట్‌లెట్‌ను సైతం పరిశీలించారు. కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ అసోసియేట్ టౌన్ ప్లానర్ సందీప్ రావుతో పాటు.. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, విమోస్ టెక్నో క్రాట్ ఎండీ పి.యూనస్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్ ఉమాదేవి తదితరులు కేంద్ర బృందంతో ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

హస్తినాపురం: షాపులో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హరిహరపురం కాలనీకి చెందిన నవనీత కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. గురువారం ఆమె ఒంటరిగా షాపులో కూర్చుని ఉండటాన్ని గుర్తించిన గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అరగంటలో పట్టేశారు..

బంగారు గొలుసు లాక్కెళ్లిన గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు అరగంటలోనే అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే వనస్థలిపురం డీఐ రాజేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. జరిగిన పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు ప్రవీణ్ రెడ్డిగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మియాపూర్: స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమలాపురం ప్రాంతానికి చెందిన దోనిపాటి నాగరాజు(35), వినోద దంపతులు ఏఎస్ రాజునగర్ రోడ్డు నంబర్ -3లో నివాసముంటున్నారు. నాగరాజు క్యాల్షియం హాస్పిటల్ ల్యాబ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం అతను బ్లడ్ శాంపుల్స్ తీసుకుని హాస్పిటల్‌కు తీసుకువస్తుండగా గోపాల్‌రావునగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై మాదాపూర్ గ్లోబల్ హెడ్జ్ పాఠశాల బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.